## అధ్యాయము 40

# చెరసాలలో యోసేపు

మనలో అందరికి మంచి అనుభవాలు మరియు చెడు అనుభవాలు ఉన్నా, యోసేపు జీవితములో వర్ణించబడిన తీవ్రమైన హెచ్చు తగ్గులు కొద్దిమంది అనుభవిస్తారు. ద్వేషముగల తన సహోదరులు అతనిని బానిసత్వములోనికి అమ్మివేసినప్పుడు, ధనవంతుడు, కుటుంబ అధిపతికి ఇష్టుడైన కుమారునిగా వున్నా అతని పరిస్థితులన్నీ నాటకీయంగా మారిపోయాయి. తర్వాత అతడు, పోతీఫరు క్రింద తన యజమానునికి కలిగినదంతటి మీద ఉన్నత స్థానానికి హెచ్చింపబడెను. కొన్ని సంఘటనల తర్వాత, యోసేపు తనను తాను చెరసాలలో చూచుకొనెను. దేవుడు మరియొకసారి, తన సహచర ఖైదీలకు మరియు చెరసాల అధిపతికి తనను తాను స్పష్టపరచుకొనే అవకాశం కల్పించాడు.

## ఫరోయొక్క అధికారులకు కూడా ఖైదు (40:1-8)

**1అటుపిమ్మట ఐగుప్తురాజుయొక్క పానదాయకుడును భక్ష్యకారుడును తమ ప్రభువైన ఐగుప్తురాజు ఎడల తప్పుచేసిరి. 2గనుక ఫరో పానదాయకుల అధిపతియు భక్ష్యకారుల అధిపతియునైన తన యిద్దరు ఉద్యోగస్థుల మీద కోపపడి 3వారిని చెరసాలలో నుంచుటకై రాజసంరక్షక సేనాధిపతికి అప్పగించెను. అది యోసేపు బంధింపబడిన స్థలము. 4ఆ సేనాధిపతి వారిని యోసేపు వశము చేయగా అతడు వారికి ఉపచారము చేసెను. వారు కొన్నిదినములు కావలిలో నుండిన తరువాత 5వారిద్దరు, అనగా చెరసాలలో బంధింపబడిన ఐగుప్తురాజు యొక్క పానదాయకుడును, భక్ష్యకారుడును ఒక్కటే రాత్రియందు కలలు కనిరి; ఒక్కొక్కడు వేరు వేరు భావముల కల కనెను. 6తెల్లవారినప్పుడు యోసేపు వారి యొద్దకు వచ్చి వారిని చూడగా వారు చింతాక్రాంతులై యుండిరి. 7అతడు-ఎందుచేత నేడు మీ ముఖములు చిన్నబోయి యున్నవని తన యజమానుని యింట తనతో కావలియందున్న ఫరో ఉద్యోగస్థుల నడిగెను. 8అందుకు వారు-మేము కలలు కంటిమి; వాటి భావము చెప్పగలవారెవరును లేరని అతనితో ననగా యోసేపు వారిని చూచి-భావములు చెప్పుట దేవుని ఆధీనమే గదా; మీరు దయచేసి ఆ కలలు నాకు వివరించి చెప్పుడనెను.**

**వచనములు 1, 2.** యోసేపును చెరసాలలో వుంచినప్పటి నుండి మరియు ఈ అధ్యాయము యొక్క సంఘటనలు మొదలవడానికి ముందు కొంత తెలియని కాలము గడిచెను. కొంత కాలము తర్వాత, ఫరో రాజుభవనము నుండి **ఇద్దరు** కొత్త ఖైదీలు వచ్చెను. ఈ వాక్యము **పానదాయకుడు** మరియు **భక్ష్యకారుడు తమ ప్రభువు, ఐగుప్తు రాజుకు మనస్తాపం కలిగించెనని** తప్ప వారికి ఎటువంటి శిక్ష వేయబడినదో ఖచ్చితముగా తెలుపలేదు.

"పానదాయకుడి" యొక్క బాధ్యత ఫరో యొక్క బల్ల యొద్ద ద్రాక్షారసమును అందించడం మరియు "ఫరో [చేతికి] గిన్నె అందించడం" (40:11, 21; 1 రాజులు 10:5; 2దిన. 9:4; నెహెమ్యా 1:11). రాజుకు విషము నిచ్చుటకు ఎవరైనా రహస్య పథకము వేసినా కాపాడుటకు, అతడు రాజుకు ద్రాక్షారసము ఇవ్వకముందు తాను తాగవలెను. "భక్ష్యకారుడు," రాజు యొక్క భోజన బల్లపై రొట్టెయు మరియు ఇతర కాల్చిన ఆహార పదార్థములను అందించుటకు అధిపతి (40:16, 17). ఇలాంటి **అధికారులు**, "అంతరంగికులుగా మరియు రాజుకు ఇష్టులుగా, రాజకీయ ప్రభావమును సంపాదించుటకు" మొగ్గుచుపుతారు.[1] వారు చేసినట్లుగా అనుమానించే నేరాలు చాలా తీవ్రమైనవి అయ్యుండొచ్చు, ఎందుకంటే **వారిపట్ల ఫరో ఆగ్రహముతో నుండెను.**

**వచనము 3.** ఫరో యొక్క ముఖ్యపనివారైన ఈ ఇద్దరు **రాజసంరక్షక సేనాధిపతికి అప్పగింపబడెను.** "సంరక్షక సేనాధిపతి" 39:1 అనే స్థానము పోతీఫరుది కాబట్టి, బహుశా ఈ చెరసాల అతని భవనములో ఉండియుండవచ్చు. 39:21, 22 ప్రకారము యోసేపు "సేనాధిపతికి" లేక "చెరసాల అధిపతికి" నమ్మకముగా ఉండెను.[2] రాజు యొక్క ఖైదీలు **చెరసాలలో** బంధిపబడెను, అది **యోసేపు కూడా బంధింపబడిన స్థలము.** 39:20 ప్రకారము "చెరసాల"ను "గుండ్రని భవనము"గా తర్జుమా చేయవచ్చు.

**వచనము 4.** పోతీఫరు ఒకప్పుడు తన ఇంటిని, పొలమును యోసేపు అధికారమునకు అప్పగించేనో అలాగే **యోసేపు** ఈ ముఖ్యమైన ఖైదీలపై **అధికారిగా** ఉండెను. **సంరక్షక సేనాధిపతియైన** పోతీఫరు,[3] రాజు యొక్క ఖైదీలను యోసేపుకు అప్పగించడం, తన భార్య యోసేపుపై చేసిన ఆరోపణలపై తనకు ఎల్లప్పుడు అనుమానము ఉన్నదని సూచిస్తుంది. యోసేపు తనకప్పగించిన పనిలో నమ్మకము కలిగి, వారికి **ఉపచారము** చేసెను. వారిద్దరూ గుర్తింపబడనికాలము **నిర్భందములో** ఉండిరి.

**వచనములు 5, 6.** వారిద్దరూ చెరసాలలో ఉన్న కాలములో, **పానదాయకుడు మరియు భక్ష్యకారుడు . . . ఇద్దరు ఒకే రాత్రియందు కలలు కనిరి.** కలలు ఆ అన్యజనులను ఇబ్బందిపెట్టాయి; తమ దేవుళ్లు భవిష్యత్తులో జరగబోయే పరిస్థితులను కలల ద్వారా హెచ్చరించునని వారు నమ్మేవారు. ఏదేమైనా, అటువంటి కలలు క్లిష్టమైన చిహ్నాలు కలిగి **ప్రతి కల దాని అర్థము** కలిగియుండెను, కాబట్టి కలలుకనేవారు తరచు వారి కలల యొక్క అర్థమును బట్టి

తికమకపడేవారు.

అందువలన, **తెల్లవారినప్పుడు యోసేపు** [ఇద్దరు ఖైదీల] **యొద్దకు వచ్చి వారిని చూడగా** వారు **చింతాక్రాంతులైయుండిరి.** హెబ్రీ పదము זָעַף (*za'ap*)కు, "పాలిపోయి" లేదా "శుష్కించినట్లు" కనబడుట అని అర్థము కలిగి, "నిరాశచెంది" (NASB; NIV), "విచారంగా" (KJV; NKJV), "సమస్యాత్మకముగా" (NRSV; ESV), లేక "కలత" (TEV; NLT) అని అనువదించబడుతుంది. ఈ హెబ్రీ పదము మరలా ఆదికాండము 40:6లో మరియు దానియేలు 1:10లోను కనబడుచున్నది. తర్వాత వాక్యములో, NRSV ప్రకారము దానియేలును అతని స్నేహితులను ఇతర యవనస్థులకంటే "దయనీయమైన స్థితి"లో ఉండకూడదనే అధిపతి యొక్క చింతను సూచిస్తుంది. క్రుశించునట్లు కనబడు స్థితి అనే ఆలోచన ఆదికాండము 40:6 యొక్క సందర్భములోనికి సరిగ్గా అమర్చబడుతుంది.[4]

**వచనములు 7, 8.** యోసేపు అతనితో నిర్బంధింపబడి తన ఆధ్వర్యంలోనున్న **ఫరో యొక్క అధికారుల** విషయంలో విషాద రూపం గురించి అతడు సహజంగా ఆందోళన చెందాడు; అందుచేత, **నేడు మీ ముఖములు ఎందుకు చిన్నబోయి యున్నవి?** అని వారిని అడిగెను. వారి మనసులో ఉన్న మొదటి సమస్య వారి కలలు కాదు, కానీ వాటిని అనువదించేవాడు లేకపోవుట. **మేము కలలు కంటిమి; వాటి భావము చెప్పగలవారెవరును లేరని** [פָּתַר, *pathar*] వారు ఉత్తరమిచ్చిరి. పశ్చిమ ఆసియాలో, కలలు వివరించుటలో పూర్తి క్రమశిక్షణ ఉన్నది, మరియు అంశం పై చేపుస్తకం వ్రాయబడినవి. రాజుగారి యొక్క సలహాదారులలో రహస్యమైన కలలు అనువదించుటకు పలు విధములైన ప్రత్యేకమైన నేర్పరులు, శూన్యగాళ్లు, మాంత్రికులు, మరియు ఇంద్రజాలకులు ఉన్నారు (దానియేలు 2:1, 2). మంత్రమును ఉపయోగించుట ద్వార నేర్పుగా అనువదించిన వారు మంచి కలలను కూడా కలిగియుంటారని వారు నమ్ముతారు.[5]

ఈ అధికారులు ఫరో యొక్క కొలువులో నుండి పెరికివేయబడి, ప్రస్తుతం ఖైదీలుగా ఉన్నారు కాబట్టి, వారి కలల యొక్క లోతైన భావమును గ్రహించుటకు నిస్సహాయులుగా ఉన్నారు. అందుచేత, **భావములు చెప్పుట దేవుని అధీనమే గదా?** అని యోసేపు వారినడిగెను (దానియేలు 2:27, 28). **మీరు దయచేసి ఆ కలలు నాకు వివరించి చెప్పుడని** అతడు చెప్పెను. ఈ అణకువ కలిగిన విదేశీ బానిసకు ఇది ధైర్యవంతమైన ప్రకటన. ఈ ఖైదీలు వారి కలల గురించి తోటి ఖైదీలతో ప్రశ్నించాలని ఎప్పుడూ ఆలోచించలేదు. అయితే, యోసేపు వ్యత్యాసంగా మాట్లాడాడు: కలల భావం చెప్పడం అనునది మానవీయమైన కళో లేక ఒక వ్యక్తి తన యజమానునికిచ్చే తలాంతో కాదు. దీనికి విరుద్ధంగా, భవిష్యత్తు సంఘటనలను నిర్ణయించి సరిగా కలలను విశదపరచులాగున మనుష్యులను బలపరచే దేవుని నుండి వచ్చే ఒక వరము అది.

## పానదాయకుని కల మరియు యోసేపు యొక్క భావము (40:9-15)

**[9]అప్పుడు పానదాయకుల అధిపతి యోసేపును చూచి–నా కలలో ఒక
ద్రాక్షావల్లి నా యెదుట ఉండెను; [10]ఆ ద్రాక్షావల్లికి మూడు తీగెలుండెను; అది
చిగిరించినట్టు ఉండెను; దాని పువ్వులు వికసించెను; దాని గెలలు పండి
ద్రాక్షఫలములాయెను. [11]మరియు ఫరో గిన్నె నా చేతిలో ఉండెను; ఆ
ద్రాక్షఫలములు నేను పట్టుకొని ఫరో గిన్నెలో వాటిని పిండి ఆ గిన్నె ఫరో
చేతికిచ్చితినని తన కలను అతనితో వివరించి చెప్పెను. [12]అప్పుడు యోసేపు–దాని
భావమిదే; ఆ మూడు తీగెలు మూడు దినములు; [13]ఇంక మూడు దినములలోగా
ఫరో నీ తలను పైకెత్తి నీ ఉద్యోగము నీకు మరల ఇప్పించును. నీవు అతనికి
పానదాయకుడవై యున్ననాటి మర్యాద చొప్పున ఫరో గిన్నెను అతని
చేతికప్పగించెదవు [14]కాబట్టి నీకు క్షేమము కలిగినప్పుడు నన్ను జ్ఞాపకముచేసికొని
నాయందు కరుణించి ఫరోతో నన్నుగూర్చి మాటలాడి యీ యింటిలో నుండి నన్ను
బయటికి రప్పించుము. [15]ఏలయనగా నేను హెబ్రీయుల దేశములోనుండి
దొంగిలబడితిని; అది నిశ్చయము. మరియు ఈ చెరసాలలో నన్ను వేయుటకు
ఇక్కడ సహా నేనేమియు చేయలేదని అతనితో చెప్పెను.**

**వచనములు 9-11. ప్రధాన పానదాయకుడు తన కలను యోసేపుతో** చెప్పడం మొదలుపెట్టాడు. ఆయన తన **ముందు ఒక ద్రాక్షవల్లిని** చూశాడు (40:9) మరియు దానికి **మూడు కొమ్మలు** ఉన్నాయి. ఈ కలలో గమనించదగిన విషయమేమనగా ఈ మూడు దశలు ఎంత త్వరగా జరిగినవో చూడండి: **అది చిగిరించినట్టు ఉండెను; దాని పువ్వులు వికసించెను; దాని గెలలు పండి ద్రాక్షఫలములాయెను** (40:10). తరువాతి మూడు సంఘటనలు కూడా త్వరితగతిన జరిగినవిగానే ఉన్నాయి. **ఫరో యొక్క** గిన్నె [ఆయన] **చేతిలో ఉన్నది** గనుక ఆ ప్రధాన పానదాయకుడు **ద్రాక్షఫలములు పట్టుకొని ఫరో** గిన్నె**లో వాటిని పిండి ఆ** గిన్నె **ఫరో చేతికిచ్చితినని** అన్నాడు (40:11). ఈ కల ద్రాక్షలు పండుటకు గాని, ఆ తీయబడిన రసమును ఫరోకు ఇచ్చే ముందు కొంచెము ఊరబెట్టుటకు గాని సమయమును ఈ కల మనకు ఇచ్చుటలేదు. కాబట్టి, సాధారణంగా కొంత సమయమును పట్టే సంఘటనలు ఇక్కడ ఒకే కల రూపంలోనికి ఇమడ్చబడ్డాయి.

**వచనములు 12, 13.** ఈ కలకు యోసేపు ఇచ్చిన భావము కూడా అంతే త్వరగా వచ్చింది. ఆలోచించుటకు, ధ్యానించుటకు, లేదా దాని గూర్చి ప్రార్థించుటకు కూడా ఆయనకు అవసరత లేనట్లుగా ఉంది. 8వ వచనము ప్రకారముగా ఆయనను వికసింపచేసిన దేవునితో ఆయనకు ఉన్న సన్నిహిత సంబంధమునకు ఈ ఉదంతము సాక్ష్యముగా ఉంది. యోసేపు వెంటనే ఈ **భావము**ను ఇచ్చాడు: **ఆ మూడు తీగెలు మూడు దినములు; ఇంకా మూడు దినములలోగా ఫరో నీ తలను పైకెత్తి నీ ఉద్యోగము నీకు మరల ఇప్పించును.**

మూడు దినములు అని ఆ కల భావంలో చెప్పబడిన సమయము ఆ పానదాయకుడు యోసేపు భావము యొక్క ఖచ్చితత్వమును పరీక్షించుటకు చాలా తక్కువ సమయముగా ఉన్నది. కలల భావమును గ్రహించుటకు ఈ హెబ్రీయునికి సామర్థ్యము ఉందా? "నీ తలను పైకెత్తు"ను అని చెప్పబడిన మాట ఇక్కడ కొంచెం అలంకార ప్రాయంగా అర్థం చేసుకోవాలి: "ఫరో నిన్ను క్షమించి నీ ఉద్యోగమునకు నిన్ను మరలా ఉంచును" (NJPSV; NEB చూడండి). ఇతర సందర్భములలో, దేవుడు కీర్తనకారుని ఆశీర్వదించి ఆయన ప్రార్థనను వినుటద్వారా ఆయన తలను పైకెత్తిన సందర్భంలో ఈ భావము ప్రయోగించబడింది (కీర్తన. 3:3; 27:6). 2 రాజులు 25:27లో, బబులోను రాజును ఉద్దేశించి ఇదే హెబ్రీ భావము ప్రయోగించబడింది, ఈ రాజు రాజైన యెహోయాకీనును బబులోను బానిసత్వము కాలములో చెరసాల నుండి "విడిపించాడు." ఈ విషయంలో, ఆపానదాయకునికి యోసేపు చెప్తున్నదేమంటే ఆయన తన ఉద్యోగమునకు మరలా పొందుకొని మునుపటివలె మరలా **ఫరో గిన్నెను అతని చేతికప్పగించుటకు** యోగ్యునిగా ఎంచబడతాడు అని చెప్పాడు.

**వచనము 14.** యోసేపు తన భావములో చాలా నమ్మకంగానే ఉన్నాడు, మరియు ఫరో ఆ పానదాయకుని రాజసేవలో తనకున్న తన మునుపటి స్థితికి తిరిగి తెచ్చునప్పుడు తనను మర్చిపోవద్దని చెప్పాడు. **కాబట్టి నీకు క్షేమము కలిగినప్పుడు నన్ను జ్ఞాపకముచేసికొని నాయందు కరుణించి** [חֶסֶד, *chesed*] **ఫరోతో నన్నుగూర్చి మాటలాడి యీ యింటిలో నుండి నన్ను బయటికి రప్పించుము** అని విన్నపము చేసుకున్నాడు. "యీ యింటిలో" నుండి అను మాట యోసేపు మరియు ఆ ఇద్దరు అధికారులు ఉంచబడిన ఆ చెరసాలను సూచిస్తుంది (40:3 చూడండి).

**వచనము 15.** తనకు బదులుగా ఫరోతో మాట్లాడుటకుగాను పానదాయకునికి యోసేపు బాధ్యతను అప్పగించాడు, కాని అది ఆయనకు కేవలం ప్రత్యుపకారము చేయవలెనని మాత్రమే చెప్పబడినది కాదు. యోసేపు తాను అమాయకుడనని, మరియు ఆయన అనుభవిస్తున్న ఈ చెర న్యాయము సరిగా జరగనందువల్ల చోటుచేసుకున్నదని యోసేపు వక్కాణించాడు. నిజానికి, ఆయన **హెబ్రీయుల దేశములోనుండి**—అంటే కనాను నుండి **దొంగిలించబడియున్నాడు** (גֻּנַּב, *ganab*) లేదా "అపహరించబడ్డాడు" అని పేర్కొన్నాడు. యోసేపు ఇష్మాయేలీయులచే దొంగిలించబడలేదు, కాని తన అన్నలు తన స్వాతంత్ర్యమును దొంగిలించి బానిసత్వమునకు ఆయనను అప్పగించినప్పుడు (37:25-28) యోసేపు ఎలా భావించాడో ఈ వాక్యము విపులంగా వివరిస్తుంది.

"హెబ్రీయుల దేశము" అను మాటను కొందరు వ్యాఖ్యాతలు కాలజ్ఞానదోషంగా భావిస్తారు ఎందుకంటే ఈ పదసమూహము విభజింపబడిన రాజ్యము యొక్క కాలములో వచ్చినదిగా ఉంది (యిర్మీయా 34:9, 14; యోనా 1:9 చూడండి). అయినను, పాతనిబంధనలో "హెబ్రీ" అనే పదము ఈ కాలముకంటే ముందుగానే

ప్రయోగించబడింది, అబ్రాహాము విషయంలో (14:13), యోసేపు విషయంలో (39:14, 17) మరియు మోషే కాలంలో ఇష్మాయేలీయుల విషయంలో (నిర్గమ. 1:15, 16; 21:2) ప్రయోగించబడింది. సౌలు కాలంలో కూడా దేవుని ప్రజలు "హెబ్రీయులు"గా పరిగణించబడ్డారు (1 సమూ. 13:3, 7, 19).

ఐగుప్తులో ఉండగా **ఆ చెరసాలలో** ఆయనను వేయుటకు ఆయన **ఏమియు చేయలేదు** అని యోసేపు నొక్కిచెప్పాడు. చెరసాల అను పదమునకు మూలపదమును (בּוֹר, *bor*) "గొయ్యి" లేదా "తొట్టి" అని కూడా అనువదించవచ్చు. కొందరు దీనిని ఇక్కడ ఒక అతిశయోక్తిగా కూడా పరిగణిస్తారు, ఎందుకంటే తన సహోదరుల ద్వారా యోసేపు తొట్టిలో నెట్టివేయబడినపుడు ఆయన భావాలను ఈ వాక్యము వ్యక్తపరుస్తుంది గనుక (37:24). ఇది సాధ్యమైన ఒక వివరణ ఐనప్పటికీ, గొయ్యిలు లేదా తొట్టిలు కూడా శ్రేష్ఠమైన కొన్ని చెరసాలవలె, లేదా కర్మాగారములవలె ప్రయోగించబడేవి అని స్పష్టంగా తెలుస్తుంది (నిర్గమ. 12:29; యెషయా 24:22; యిర్మీయా 38:6-13). John E. Hartley ఆలోచన ప్రకారము, "కనానులో ఉన్న ఒక 'గోతి' నుండి తీయబడి ఐగుప్తులో ఉన్న మరొక 'గోతి'లో పడవేయబడినందుకు యోసేపు ప్రలాపించాడు" అని అంటున్నాడు.[6]

## భక్ష్యకారుల అధిపతి యొక్క కల మరియు యోసేపు యొక్క భావము (40:16-19)

**16అతడు తెలిపిన భావము మంచిదని భక్ష్యకారుల అధిపతి చూచి అతనితో నిట్లనెను–నేనును కల కంటిని; ఇదిగో తెల్లని పిండివంటలు గల మూడు గంపలు నా తలమీద ఉండెను. 17మీదిగంపలో ఫరో నిమిత్తము సమస్తవిధములైన పిండివంటలు ఉండెను. పక్షులు నా తలమీదనున్న ఆ గంపలోనుండి వాటిని తీసికొని తినుచుండెను. 18అందుకు యోసేపు–దాని భావమిదే; ఆ మూడు గంపలు మూడు దినములు 19ఇంక మూడు దినములలోగా ఫరో నీ మీదనుండి నీ తలను పైకెత్తి మ్రానుమీద నిన్ను వ్రేలాడదీయించును. అప్పుడు పక్షులు నీ మీదనుండి నీ మాంసమును తినివేయునని ఉత్తరమిచ్చెను.**

**వచనములు 16, 17.** పానదాయకుల అధిపతి కలకు యోసేపు ఇచ్చిన అనుకూల భావము **భక్ష్యకారుల అధిపతి**ని కూడా ఈ యౌవ్వన బందీకి తన కలను చెప్పుకోవడానికి, అంతేగాక తన కలకు కూడా అట్టి ఒక అనుకూల వివరణే వస్తుందనే ఆశతో, ప్రోత్సహించింది. ఆయన మాట్లాడుతూ, **ఇదిగో తెల్లని పిండివంటలు గల మూడు గంపలు నా తలమీద ఉండెను** అంటూ మొదలుపెట్టాడు. NASBలో "తెల్లని పిండివంటలు గల మూడు గంపలు" అని ఉండగా, ఇతర

అనువాదములలో వేరే అనువాదాలు ఉన్నాయి. హెబ్రీ పదమైన חֹרִי (*chori*) యొక్క అర్థము అనిశ్చితము, ఎందుకంటే పాత నిబంధన మొత్తములో ఈ పదము ఇక్కడ మాత్రమే వస్తుంది. KJV అనే అనువాదము "తెల్లని గంపలు" అని వ్రాయగా, NAB అనువాదము "చువ్వలతో అల్లిన గంపలు" అని అనువదిస్తుంది. NRSV వాటిని "రొట్టెల గంపలు" అని అనగా, NLT మాత్రం "తెల్లని పిడివంటలుగల బుట్టలు" అని అనువదిస్తుంది.

తన కలను ఇంకా చెప్తూ, **మీదిగంపలో ఫరో నిమిత్తము సమస్తవిధములైన పిండివంటలు ఉండెను** అని ఆ భక్ష్యకారుల అధిపతి అంటున్నాడు. వండబడిన ఆహార పదార్థములు చరిత్రలో చాలా పూర్వకాలము నుండే ఐగుప్తీయులచే కొనబడేవి. చిత్రలిపిని కలిగియుండే ఐగుప్తీ నిఘంటువు ఒకటి ముప్పది-ఎనిమిది రకాల పిండివంటలను మరియు ఏబది-ఏడు రకముల రొట్టెలను గూర్చి ప్రస్తావిస్తుంది.[7] ఈ కలలో భాదకలిగించే విషయం ఏమంటే ఈ భక్ష్యకారుల అధిపతి పైగా వస్తున్న **పక్షులను** తోలలేక పోయాడు (15:11 చూడండి). [ఆయన] **తలమీద నున్న ఆ గంపలో నుండి**రుచిగల వంటలను ఆ పక్షులు **తింటున్నాయి.**

**వచనములు 18, 19.** అనిశ్చితిని సూచించునట్లు సంశయించకుండా, ఆ భక్ష్యకారుల అధిపతికి **యోసేపు** బదులుగా తన కల యొక్క **భావము**ను ఇచ్చాడు. అయినను, దుర్వార్తను ఆయన కడవరకు చెప్పకుండా ఆపాడు, ఆ పానదాయకునికి ఇచ్చిన భావమువలెనే భక్ష్యకారుల అధిపతికి కూడా ఒకేరకమైన ఆరంభ భావాన్ని ఇచ్చాడు. **ఆ మూడు గంపలు** 40:10లో ఉన్న మూడు కొమ్మలవలె **మూడు దినముల**ను సూచిస్తున్నవని ఆయన అన్నాడు. అప్పుడు తన భావము యొక్క శబ్దలక్షణము కొంత అరిష్టముగా మారింది గనుక, **ఇంక మూడు దినములలోగా ఫరో నీ మీదనుండి నీ తలను పైకెత్తి మ్రానుమీద నిన్ను వ్రేలాడదీయించును. అప్పుడు పక్షులు నీ మీదనుండి నీ మాంసమును తినివేయును** అని ఆయన అన్నాడు.

ఈ విధంగా ఉరిని నిర్వహించుటకు అనుసరించవలసిన ఖచ్చితమైన పద్ధతి ఏమైనా ఉందా? "నీ తలను పైకెత్తును" అనే మాటలు యోసేపు పానదాయకునితో మాట్లాడిన పదములకు ఒక పదచాతుర్యముగా కనబడుతుంది (40:13). అది ఒకవేళ నిజమైనదైతే, అప్పుడు ఆ పానదాయకుని తల ఔన్నత్యముతో పైకెత్తబడవలసి ఉంది, మరియు భక్ష్యకారుల అధిపతి యొక్క తల ఉరితీయబడుచుండగా అవమానముతో ఎత్తబడవలసి ఉంది (40:20-22 చూడండి). ఈ క్రమంలో NEB అనువాదము "ఫరో నిన్ను ఎత్తి చెట్టుపై వ్రేలాడదీయించును" అని మాములుగా చెప్తుంది. ఈ విషయంలో, అది ఉరికంబంపై వేయడం మినహాయిస్తే మరణము ఉపక్రమించవలసిన రీతి అనిశ్చితంగా ఉంది.

అయినప్పటికీ, పదముల చాతుర్యము ఖచ్చితముగా ఉండగా, "నీ *నుండి* నీ తలను పైకెత్తును" (ఉద్ఘాటన జోడించబడినది) అనే పదసమూహాము శిరచ్ఛేదనము ద్వారా మరణము ప్రాప్తిస్తుందని తెలుపుతుంది. ఈ ఆలోచన చాలా

అనువాదముల ద్వారా తెలియజేయబడుతుంది: “నీ తలను పైకెత్తును –నీ నుండి!” (NRSV; ESV), “నీ తలను నీనుండి ఎత్తివేయును” (NIV; NJPSV), “నీ తలను నరికివేయును” (CEV; NCV), మరియు “నీ తలను నీ భుజములనుండి పైకెత్తును” (REB). శిరచ్ఛేదనముగావించబడిన తరువాత, ఆ భక్ష్యకారుల అధిపతి యొక్క శరీరము ఇంకా “మ్రానుమీద” వ్రేలాడదీయించుట ద్వారా మరి ఎక్కువ అవమానమును పొందును (NRSV; NLT)–అంటే, “ఒక స్తంభమునకు గుచ్చబడటం” (NAB).[8] ఈ వివరణతో కొందరు వ్యాఖ్యాతలు ఏకీభవించబు, ఎందుకంటే శిరచ్ఛేదనములోని విధానాలు మరియు ఉరి తీయడమనేది రెండు భిన్నమైన విషయాలు అనేది వారి వాదన.[9] ఏది ఏమైనప్పటికీ, రాజైన సౌలును గూర్చిన ఉదాహరణ ఉరి తీయబడిన తరువాత శిరచ్ఛేదనము జరుగుటకు అవకాశము ఉన్నట్లుగా నిరూపిస్తుంది.[10]

వారు ఎలా చంపబడ్డారో అనేదానితో సంబంధంలేకుండా, ఉరి తీయబడిన బందీలు దుశ్చర్యలకు పాల్పడేవారికి సంక్రమించే సమర్థమైన విధికి సూచనగా ఉండులాగున తరచూ వ్రేలాడదీయబడేవారు (ద్వితీయ. 21:22, 23; యెహోషువా 8:29; 10:26; 2 సమూ. 4:12). వారి దేహములు పంచభూతములకు చాపబడి ఉండేవి, మరియు వారి **మాంసము పక్షుల** ద్వారాను లేదా క్రూర మృగముల ద్వారాను తినబడుతుంది (2 సమూ. 21:10 చూడండి). “పక్షులు” భక్ష్యకారుల అధిపతి యొక్క మాంసమును, అనగా తన కలలో అవి తన తలమీదనున్న గంపలలో నుండి పిండివంటలను తిన్నట్లుగానే, తింటాయి (40:17). మరణము తరువాత శరీరమును భద్రపరచుటకు ఐగుప్తీయులు చాలా విలువనిచ్చేవారు గనుక (50:2, 26 చూడండి), గుచ్చబడిన, పక్షులచే తినబడుచున్న కుళ్లిపోతున్న శవము ప్రత్యేకముగా చాలా హేయమైనదిగా అనిపించి ఉంటుంది.[11]

## కలల యొక్క నెరవేర్పు (40:20-23)

**[20]మూడవ దినమందు జరిగినదేమనగా, ఆ దినము ఫరో జన్మదినము గనుక అతడు తన సేవకులందరికి విందు చేయించి వారి నడుమ పానదాయకుల అధిపతి తలను భక్ష్యకారుల అధిపతి తలను పైకెత్తి [21]పానదాయకుల అధిపతి ఉద్యోగము మరల అతనికిచ్చెను గనుక అతడు ఫరోచేతికి గిన్నె నిచ్చెను. [22]మరియు యోసేపు వారికి తెలిపిన భావముచొప్పున భక్ష్యకారుల అధిపతిని వ్రేలాడదీయించెను. [23]అయితే పానదాయకుల అధిపతి యోసేపును జ్ఞాపకము చేసికొనక అతని మరచిపోయెను.**

**వచనము 20.** ఈ ముగింపు పేరా చదివితే ఎటువంటి సహజసిద్ధమైన సామర్థ్యతకు కూడా అంటూ చిక్కని భవిష్యత్తును గూర్చిన జ్ఞానమును దేవుడు యోసేపునకు ఇచ్చాడని వెల్లడి చేస్తుంది. యోసేపు ఈ భావము చెప్పిన తరువాత

(40:12, 13, 18, 19 చూడండి) **మూడవ దినము ఫరో యొక్క జన్మదినమును** జరుపుకొనే ప్రత్యేకమైన దినము. అది జాతీయ సెలవు దినము, అందులో ప్రతివిధమైన వ్యాపారము నిలిపివేయబడి ప్రజలందరూ ఆ వేడుకలలో పాల్గొనేవారు. ఫరో ఒక **విందును** (מִשְׁתֶּה, *mishtheh*, "త్రాగుడు విందు కార్యక్రమము"[12]) చేయించి **తన సేవకులందరిని** (ప్రజా సేవకులందరిని) పిలిపించాడు. ఆ దినమున యోసేపు ముందుగా ప్రకటించిన విధమునకు విరుద్ధముగా **వారి నడుమ పానదాయకుల అధిపతి తలను భక్ష్యకారుల అధిపతి తలను పైకెత్తెను.**

**వచనములు 21, 22.** ఆయన **పానదాయకుల అధిపతిని** నిర్దోషిగా ఎంచి తన **ఉద్యోగము మరల అతనికిచ్చెను.** తన గిన్నెను రుచించుటకు, తద్వారా దానిలో విషపదార్థము ఏమి కలుపలేదని నిరూపించుటకు ఆ సేవకుడు ఇంకా కూడా యోగ్యమైనవానిగానే ఉన్నాడని ఈ కార్యము తెలియజేస్తుంది, **గనుక అతడు ఫరోచేతికి గిన్నె నిచ్చెను.** అయినను, **భక్ష్యకారుల అధిపతి** ఫరోకు విరోధముగా ఒక ఘోరమైన నేరము చేసినట్లుగా ఋజువు చేయబడ్డాడు; కనుక, రాజు ఆజ్ఞలు జారీ చేసి ఆయనను **ప్రేలాడదీయించాడు.** ఈ సంఘటనను **యోసేపు వారికి తెలిపిన భావము చొప్పున**నే జరిగినవి.

**వచనము 23.** యోసేపు **పానదాయకుల అధిపతితో** ప్రోత్సాహకరమైన ఈ మాటలు చెప్పినప్పటికీ, ఈ మునుపటి బందీ ఆయనను గాని లేదా సహాయార్థం ఆయన చేసిన విన్నపమును గాని **జ్ఞాపకము చేసుకొనలేదు.** బదులుగా, **అతని మరచిపోయాడు** మరియు ఫరోతో తన కల భావము చెప్పినవాని విషయము చెప్పలేకపోయాడు. ఫరో యొక్క దాసులు ఆయనను కలిసిన చోటనే, పోతీఫరు భార్యపై బలాత్కారము చేశాడు అనే తప్పుడు నేరారోపణతో చెరసాలలో వేయబడిన చోటనే, యోసేపు సమూలంగా నిరాశచెందాడు. యోసేపు మరి రెండు సంవత్సరాల పాటు ఆ చెరసాలలోనే, బహుశా జ్ఞాపకమునకు నోచుకోకుండానే ఉండవలసి వచ్చింది (41:1).

## అన్వయము

### వేచి చూచుటను నేర్చుకోవడం (అధ్యాయము 40)

బంధకము అనే కష్టములను ఎదుర్కొనుచుండగా యోసేపు తన విశ్వాసములో పరిపక్వమౌతున్నాడు (39వ అధ్యాయము). ఆయన చెరసాలలో ఉన్నప్పుడు కూడా తన విశ్వాసము మరియు యథార్థత కొనసాగినవి.

*దేవుని ప్రజలు కొన్నిసార్లు వారిని వారు కష్టతరమైన పరిస్థితులలో కనుగొంటారు ఆ పరిస్థితులలో ప్రక్షాళన చేయబడుటకు గాను వారు విశ్వాసముతో ఎదురుచూడవలసి ఉంటుంది.* యోసేపు పోతీఫరుచే నమ్మబడ్డాడు, ఆయన తన

యావదాస్తి అంతటిపై మరియు ఇంటి పనుల విషయం అంతయు ఆయన ఆధీనమునకు ఇచ్చాడు– కాని ఒక మినహాయింపు, అదే తన భార్య విషయం. ఆమె ఆయనను లోబరచుకొనుటకు ప్రయత్నించినప్పుడు యోసేపు ఆమెకు లొంగుటకు ఒప్పుకొనలేదు, ఎందుకంటే అట్టి ఒక కార్యము తన యజమానుడు ఆయనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేస్తుంది మరియు దేవునికి విరోధముగా పాపమును చేయిస్తుంది. యోసేపు నమ్మకస్థుడుగా ఉన్నప్పటికీ కూడా, బహుశా తన భార్యను కొంచెం శాంతింపచేయుటకు కాబోలు, పోతీఫరు ఆయనను చెరసాలలో వేయించాడు. ఈ పరిసరాలలో కూడా, దేవుడు యోసేపుతో ఉన్నాడు, అక్కడ ఉన్న బందీలందరిపైన ఒక నాయకునిగా ఉండునంతవరకు దేవుడు ఆయనను "వృద్ధిపరచాడు" (39:21-23). కాని, ఆయన బంధకములో ఒక బందీవలె ఉన్నాడు, మరియు "దేవుని యొక్క వాక్యము ఆయనను శోధించింది [లేదా 'పవిత్రపరచింది']" (కీర్తనలు 105:19). ఈ విధంగా శోధించడం చాలా కష్టం, కాని అది యోసేపులో ఆత్మీయమైన బలాన్ని నిర్మించింది (యాకోబు 1:2-4, 12; 1 పేతురు 1:6, 7 చూడండి).

తన పానదాయకుల అధిపతితోనూ మరియు భక్ష్యకారుల అధిపతితోనూ రాజు ఎందుకు అంత కోపంగా ఉన్నాడో ఈ వాక్యము మనకు ఏమియు చెప్పుటలేదు కాని, వారు సింహాసనమునకు విరోధముగా రహస్య ఆలోచన చేయుచున్నట్లుగా మనకు ఈ వాక్యము సూచిస్తుంది. ప్రధానమైన ఈ ఇద్దరు వ్యక్తులు చెరసాలలో ఉంచబడినప్పుడు, వారు యోసేపు యొక్క అధీనము క్రిందికి వచ్చారు, మరియు ఆయన తెలియబడని కాలము వరకు "వారికి ఉపచారము చేసెను" (40:4). ఈ సేవ ఆయనకు వారి విశ్వాసమును గెలుచుకొనునట్లు చేసింది, మరియు వారు తమ కలలను ఆయనతో పంచుకున్నారు. ఈ సంఘటనల అన్నిటి వెనుక దేవుడు తన సంకల్పంలో, అత్యంత అసౌకర్యమైన మరియు అంగీకారయోగ్యముకాని స్థలములో–చెరసాలలో–ఐగుప్తులో యోసేపును అధికారములోనికి తెచ్చుటకు గాను కార్యము చేస్తున్నాడు. ఈ విధంగా, అబ్రాహాము యొక్క సంతానము వారు జీవించుటకును మరియు మోషే నాయకత్వంలో వారు వాగ్దాన దేశమునకు పాదయాత్రను చేయుకాలమువరకు అక్కడ విస్తరించుటకును ఒక దేశము వారికి ఇవ్వబడుతుంది.

నిజానికి, వీటిలో ఏది కూడా యోసేపుకు అర్థం కాలేదు అనుకోండి! దేవుడు తనకొరకు దాచి ఉంచిన ఆశీర్వాదమును లేదా అట్టి అసహ్యకరమైన చెరసాలలో ఇంకను ఉండుటకు ఎందుకు బలవంతము చేయబడ్డాడో అనే విషయమును ఆయన చూడలేక పోయాడు. "ఉపయోగం ఏంటి", దేవుడు పట్టించుకోవడంలేదు, లేకపోతే ఆయన నన్ను బయటకు విడిపించేవాడే" అని అనుకుంటూ సంకుచితమైన వ్యక్తి అనుకొనేవాడు. అయినను, యోసేపు ఇక్కడ మొండిగా లేదా బాధాకరంగా మారలేదు; కాని, తన జీవితము విషయమై దేవునికి ఒక ప్రణాళిక ఉంటుందని ఆయన నమ్మాడు. యోసేపు యొక్క పరిస్థితి తరువాతి కాలంలో

యూదా ప్రజలు బలవంతంగా తన సొంత దేశము నుండి తీసివేయబడి సుదూరంగా మెసొపొతామియా లోయలో బందీలుగా ఉంచబడినప్పటి (యెషయా 42:22 చూడండి) వారి పరిస్థితివలె ఉంది. అక్కడ చెరగొనబడినవారికి యెషయా ప్రకటించిన వార్తా ఐగుప్తులో యోసేపుకు కూడా అన్వయించేదిగా ఉంది. ఆయన ప్రవక్తల మాటలు ఎన్నడు విననివాడిగా ఉన్నప్పటికీ కూడా, "యెహోవా కొరకు ఎదురు చూచు వారు నూతన బలమును పొందుదురు" అనే వాక్యమును కొంతవరకు నమ్మినట్లుగానే ఉన్నాడు (యెషయా 40:31).

*దేవుని ప్రజలు తమ విశ్వాసమును వెల్లడి చేయుటకుగాను, ప్రతి పరిస్థితిని కూడా ఉపయోగించుకోవాలి, ఆ పరిస్థితులు ఎంతటి కష్టంగా నిరాశాజనకంగా కనిపించినప్పటికీ కూడా.* తన వశమునకు అప్పగింపబడిన బందీలలో ఇద్దరు ఒకే రాత్రియందు కలలను కని తరువాతి ఉదయమునకు "విచారంగా ఉన్నప్పుడు" యోసేపునకు ఒక మంచి అవకాశం వచ్చింది (40:6). వారు ఎందుకు అంట నిరాశగా ఉన్నారో ఆయన వారిని అడిగినప్పుడు, వారు తన కలలను విశదపరచుటకు ఎవరును లేరు అని తమ విచారమును వ్యక్తపరచారు. వారు జ్ఞానులతోనూ, మాత్రికులతోనూ, ఫరో కోటలో ఉండే గారడీవారతోనూ ఎటువంటి సంబంధము లేనివారిగా ఇప్పుడు ఉన్నారు, వీరు కలల భావము చెప్పుటలో నిష్ణాతులు.

యోసేపు దేవునిలో, అనగా కలలకు అసలైన భావములను చెప్పగల ఏకైక దేవునిపై, ఆయనకున్న విశ్వాసమును ఒప్పుకొనుటకుగాను ఇది మంచి సందర్భమును ఇచ్చింది. దేవుడు ఆ కలల భావములను బయలుపరుస్తాడని చెప్తూ వారు తమ కలలను ఆయనతో పంచుకొనవలసినదిగా వారిని ప్రోత్సాహించాడు. తన కలను పంచుకొనుటలో పానదాయకుల అధిపతి మొదటివాడు, మరియు యోసేపు దానికి అనుకూలమైన ఒక భావాన్ని ఇచ్చాడు. తన పూర్వపు స్థితికి తిరిగి చేర్చబడిన తరువాత యోసేపు ఆ కల యొక్క సరియైన భావమును తెలియజేశాడు అని ఫరోతో ఆ పానదాయకుల అధిపతి చెప్పి తనకు కరుణ చూపవలసినదిగా ఒక వ్యక్తిగత విన్నపమును చేసుకున్నాడు. మొదటి భావము అనుకూలమైనదిగా ఉన్నది గనుక, భక్ష్యకారుల అధిపతి కూడా తన కలను పంచుకొనుటకు ప్రోత్సాహించబడ్డాడు. ఈ కల యొక్క భావము విధ్వంసకరంగా ఉంది: ఫరో "తన తలను పైకెత్తి" మ్రానుపై ఆయనను వ్రేలాడదీయించాడు.

ఐగుప్తీయుల చెరసాలలో కష్టతరమైన పరిస్థితుల మధ్య కూడా యోసేపు దేవునిపై ఆయనకు గల విశ్వాసమును వెల్లడి చేశాడు; కాని ఆయన చేసిన ప్రయత్నముల ఫలితము తనకు నిరాశాజనకంగా ఉన్నాయి. పానదాయకుల అధిపతి యోసేపును గూర్చి ఫరోతో ఏమియు చెప్పలేదు, కాని ఆయనను పూర్తిగా మర్చిపోయాడు (40:23).

ఈ సమయములో యోసేపు మదిలో గుండా ఎటువంటి ఆలోచనలు

వెళ్లాయో మనకు ఖచ్చితముగా తెలియదు. ఆయన బానిసత్వము క్రింద మ్రగ్గాడు మరియు పదకొండు సంవత్సరములు చెరసాలలో బందీగా ఉన్నాడు[13], మరియు ఐగుప్తులో అనుభవిస్తున్న ఆ చెరనుండి విడిపించవలసినదిగా దేవుని కొరకు నిస్సందేహంగా ఎదురుచూస్తున్నాడు.

తన మానసిక సంక్షోభము మధ్యలో, తన ముత్తాతయైన అబ్రాహాము వాగ్దాన పుత్రుడైన ఇస్సాకు పుట్టుటకు మునుపు వంద సంవత్సరాల వయసుగల వాడని బహుశా జ్ఞాపకము చేసికొని ఉంటాడు. తన తాతయైన ఇస్సాకు, తన భార్యయైన రిబ్కాను కలుసుకొనుటకు నలుబది సంవత్సరాలు ఎదురు చూడడం, మరియు యాకోబు (యోసేపు యొక్క తండ్రి) ఏశావులు (యోసేపు యొక్క పెదనాన్న) జన్మించుటకు గాను ఆయన ఇంకా ఇరువది సంవత్సరాలు ఎదురు చూడవలసి రావడం అనే విషయములను కూడా ఆయన జ్ఞాపకము చేసుకొని ఉంటాడు. యాకోబు కూడా కష్టతరమైన పరిస్థితులలో హారానులో తన భార్యల కొరకు మరియు బిడ్డల కొరకు, అదేవిధంగా తన గొఱ్ఱెల కొరకు మరియు మందల కొరకు ఎంతగా కష్టపడవలసి వచ్చినదో, కనానులో ఉన్న తన సొంత ఇంటికి తిరిగి వచ్చునంత వరకు ఎలా ఎదురు చూడవలసి వచ్చినదో ఆయన ఖచ్చితముగా జ్ఞాపకము చేసుకొని ఉంటాడు.

సుదీర్ఘ కాలముల పాటు తన పితరులు ఎంతటి కష్టములను మరియు పోరాటాలను ఎదుర్కొన్నారో అనే విషయమై యోసేపు ఆలోచించినవాడైతే, అట్టి ఆలోచనలు ఖచ్చితముగా భవిష్యత్తును గూర్చి ఆయన కూడా దిగులు పడకూడదు అనే నిశ్చయతను ఇచ్చి ఉంటాయి. అంతటిలో, పానదాయకుల అధిపతికిని మరియు భక్ష్యకారుల అధిపతికిని సరియైన భావములను తెలియజేయుటకు దేవుడే ఆయనకు సహాయము చేశాడని ఆయనకు తెలుసు. స్పష్టంగా, తన జీవితము ఏమైయున్నదో లేదా అది ఎప్పుడు కార్యరూపం దాల్చుతుందో ఆయనకు తెలియకున్నను కూడా తన జీవితము పట్ల దేవునికి ఒక ప్రణాళిక ఉంది అని తెలుసు.

*ముగింపు.* దేవుడు తన ప్రజలకు ఉన్నతమైన బాధ్యతలను అప్పగించే ముందు తన వాగ్దానములపై వారు ఎంత విశ్వాసము కలిగి ఉన్నారో అనే విషయమును పరీక్షిస్తాడు. ఇక్కడ హబక్కూకు పలికిన మాటలు సమయోచితముగా ఉన్నాయి: “అది ఆలస్యముగా వచ్చినను, దానికొరకు కనిపెట్టుము; అది తప్పక జరుగును, జాగుచేయక వచ్చును” (హబ. 2:3; ESV). దేవుడు గడియారములు మరియు క్యాలెండరులచే నియంత్రించబడలేడు, లేదా ఆయన మానవ నిర్మితమైన ఏ ఒక్క సమయ క్రమాన్ని పాటించాడు. యోసేపు బహుశా ఆశ్చర్యపడినట్లుగా దేవుని ప్రజలు కూడా, “దేవుడు ఎక్కడ ఉన్నాడు? ఆయన ఏమి చేస్తున్నాడు? ఆయన ఎందుకు ఇంత సమయమును తీసుకుంటున్నాడు?” అని అడిగి ఉంటారు. దేవుడు యెషయా 55:8లో ఏమి బయలుపరచాడో దానిని విశ్వాసులు నమ్మాలి: “నా తలంపులు మీ

తలంపులవంటివి కావు మీ త్రోవలు నా త్రోవలవంటివి కావు." ఇంకా, "ఆకాశములు భూమికిపైన యెంత ఎత్తుగా ఉన్నవో మీ మార్గములకంటె నా మార్గములు మీ తలంపులకంటె నా తలంపులు అంత యెత్తుగా ఉన్నవి" (యెషయా 55:9) అని దేవుడు అంటున్నాడు.

ఆదిమ క్రైస్తవులు ఈ భావములను గ్రహించారు మరియు కష్టతరమైన పరిస్థితులలో వారి విశ్వాసమును వెల్లడి చేశారు. యేసు త్వరగా తిరిగి రావాలని వారు అనుకున్నప్పటికీ, ఎదురు చూడవలసి వచ్చినప్పుడు వారు ఆదుర్దా పడలేదు (1 థెస్స. 4; 5; 2 థెస్స. 2:1-3). పెంతెకోస్తు దినమునకు మరీ ఎక్కువ దినములు గడవక ముందే, పేతురు మరియు యోహానులు బంధించబడి, చెరసాలలో వేయబడి, మరియు యేసును మెస్సీయగా (క్రీస్తుగా) ప్రకటించడం మరియు ఆయన నామము పేరిట అద్భుతములను చేయడం మానకపొతే (అపొ. 4:5-22) తీవ్రమైన శిక్షతో భయపెట్టబడ్డారు. వారు ధైర్యముగా "మేము కన్నవాటిని విన్నవాటిని చెప్పక యుండలేము" అని చెప్పారు (అపొ. 4:20). తరువాత, యూదుల నాయకులు అపొస్తులులను మరలా బంధించి వారిని సభ ముందుకు (సన్హెద్రెను) తెచ్చారు. ప్రధాన యాజకుడు వారిని బెదిరించేటట్లు మాట్లాడాడు మరియు వారు ఇకమీదట యేసు అనే నామములో మాట్లాడుటకు నిషేధించబడ్డారు అనే విషయమును జ్ఞాపకము చేశారు. మరలా, అలా అణిగిమణిగి యుండుటకు అపొస్తులులు నిరాకరించారు. పేతురు మరియు అపొస్తులులు అన్నారు, "దేవునికే మేము లోబడవలెను గదా" అని ఉత్తరమిచ్చాడు (అపొ. 5:29). వారు యేసు యొక్క మరణమును, సమాధిని, మరియు పునరుద్ధానములను గూర్చి, అలాగే దేవుని సింహాసనమునకు ఆయన ఆరోహణమును గూర్చి కూడా ప్రకటించడం కొనసాగించారు. వీటన్నిటికి కూడా ప్రత్యక్ష సాక్షులమని వారు ధైర్యముగా చెప్పారు.

దీనికి తోడు, దేవుడు యేసునకు విధేయులైన వారందరికి వారివారి "పాప క్షమాపణ దయచేయుటకై" ఆయనను "అధిపతిగాను రక్షకునిగాను" చేశాడు అని వారు ఒప్పుకున్నారు (అపొ. 5:30-32). క్రీస్తును గూర్చి బోధించుటలో వారు కనబరచిన నిలకడత్వము యూదులకు బహు కోపాన్ని కలిగించింది, వారు అపొస్తులులకు మరణదండనే తగిన శిక్షగా భావించారు (అపొ. 5:33). గమాలియేలు యొక్క సమాలోచన వలన వారు కొరడాలతో కొట్టించడమనే తక్కువ శిక్షకు ఒగ్గారు; కాని యేసు అనుచరులను మరలా ఆయన గూర్చి ఎన్నడును మాట్లాడకూడదని గట్టిగా హెచ్చరిక చేశారు (అపొ. 5:34-40). అయినప్పటికీ, అపొస్తులులు "యేసు క్రీస్తును గూర్చి బోధించడం మరియు ప్రకటించడం" కొనసాగించారు. ఈ నిర్ణయము దీర్ఘకాలిక హింసాకాండకు, చెరసాలలో బంధించుటకు, ఎక్కువగా కొరడా దెబ్బలతో దండించుటకు (అపొ. 5:41, 42; 6:8-15), మరియు హతసాక్షులుగావించబడుటకు కూడా దారి తీసింది (అపొ. 7:1–8:3); అయినను అపొస్తులులు మరియు ఇతర ఆదిమ క్రైస్తవులు,

వారు ఎదుర్కొన్న కష్టములు మరియు శోధనలు ఎన్ని ఉన్నప్పటికీ, వారి విశ్వాసమును గూర్చి సాక్ష్యమిచ్చుటలో యెడతెగక ఉన్నారు.

---

సూచనలు

[1]K. A. Kitchen, "Cupbearer," in *The New Bible Dictionary*, ed. J. D. Douglas (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1962), 283. [2]Bruce K. Waltke, *Genesis: A Commentary* (Grand Rapids, Mich.: Zondervan Publishers, 2001), 525. [3]ఇక్కడ ఇవ్వబడిన ప్రస్తావన పోతీఫరును గూర్చి మాట్లాడుతుందా (39:1) లేక ఆయన తరువాత వచ్చిన అధికారిని గూర్చి మాట్లాడుతుందా అనే విషయంపై పండితులు భిన్నాభిప్రాయాలతో ఉన్నారు. మనము ఖచ్చితముగా చెప్పలేకపోయినప్పటికీ, ఈయన యోసేపు యొక్క వాస్తవమైన యజమానునిగా అగుపడుచున్నాడు. (John T. Willis, *Genesis,* The Living Word Commentary [Austin, Tex.: Sweet Publishing Co., 1979], 403.) [4]Helmer Ringgren, "זָעַף," in *Theological Dictionary of the Old Testament*, trans. David E. Green, ed. G. Johannes Botterweck and Helmer Ringgren (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1980), 4:111. [5]Victor P. Hamilton, "פָּתַר," in *TWOT*, 2:744–45. [6]John E. Hartley, *Genesis*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 2000), 324. [7]Jozef Vergote, *Joseph en Égypte: Genèse Chap. 37—50, à la Lumière des Études Égyptologiques Récentes* (Louvain: Publications Universitaires, 1959), 37. Vergote cited Adolf Erman and Hermann Grapow's Egyptian Dictionary, *Wörterbuch der aegyptischen Sprache*, 6 (Leipzig: Hinrichs, 1929). [8]See Ronald F. Youngblood, "תָּלָה," in *TWOT*, 2:970–71. [9]Kenneth A. Mathews, *Genesis 11:27—50:26*, The New American Commentary, vol. 1B (Nashville: Broadman & Holman Publishers, 2005), 751 లోని చర్చను చూడండి. [10]రాజైన సౌలు (మరియు అతని ముగ్గురు కుమారులు) మరణించిన తరువాత, ఫిలిష్తీయులు "ఆయన యొక్క తల"ను చేదించి ఆయన దేహమును "బేత్షాను అనే గోడకు తగిలించిరి" (1 సమూ. 31:8-10). ఈ సంఘటనకు ఉన్న మరొక ఉదాహరణ బేత్షానులో "ఉరితీయబడిన" (תְּלָה, *thalah*) వారు ఉన్నట్లుగా ఉన్న వాక్యము (2 సమూ. 21:13).

[11]Willis, 405. [12]See Francis Brown, S. R. Driver, and Charles A. Briggs, *A Hebrew and English Lexicon of the Old Testament* (Oxford: Clarendon Press, 1962), 1059. See also 26:30; 29:22; Judg. 14:12, 17; Esther 1:3, 5, 7; 2:18. [13]తన జీవితమును గూర్చి యోసేపు యొక్క కథనములలో ఉన్న సమాచారము నుండి రెండు ఆధారములను అనుసరించి వివిధ దశలలో ఆయన వయస్సును అంచనా వేయొచ్చు. యాకోబు ఆయనకు ఒక ప్రత్యేకమైన అంగీని ఇచ్చినపుడు ఆయనకు పదిహేడు సంతవ్సరములు (37:2), మరియు ఐగుప్తులో ఫరో ఆయనను ఒక ఉన్నత అధికారిని చేసినప్పుడు ఆయన ముప్పది సంవత్సరముల వయసుగలవాడు (41:46). ఫరో కలలు కనుటకు రెండు సంవత్సరములు ముందు (41:1) ఆయన తన తోటి బందీల యొక్క కలలను కూడా విశదపరచాడని మనకు తెలుసు (40వ అధ్యాయము).